# పోలీసు వాళ్లలో మంచివాళ్లున్నారా?

గోపాల్‌రెడ్డి తన మారుతీ కారును తనే నడుపుతూ స్వంత ఫ్యాక్టరీకి బయలుదేరాడు. మద్రాసు నుంచి ముందురోజు వచ్చిన కృష్ణారావు కూడా ఆయనతో వున్నాడు. ఎన్నో సంవత్సరాల తరువాత వచ్చిన మిత్రుడాయన. మద్రాసులో ఒక పెద్ద కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న కృష్ణారావుకు వివాహం మూడు సంవత్సరముల క్రితం నెల్లూరులో జరిగింది. దానికిగాను శుభలేఖ పంపించి, రెండుసార్లు అతను ఫోన్‌లో చెప్పిన తరవాడ కూడా, వివాహానికి వెళ్లలేక పోయానని గోపాల్‌రెడ్డికి చాలా ''ఎంబరాసింగ్''గా వుండేది. అతను పటాన్‌చెరువులో ఒక ఫ్యాక్టరీ ప్రారంభించి నాలుగు సంవత్సరాలయింది. దాని ప్రారంభదశా విఘ్నాలు, కష్టాలు అన్నీ అయిపోయిన తర్వాతనే వివాహం చేసుకుందామని అనుకున్న గోపాల్‌రెడ్డి వయస్సు ఇప్పుడు దాదాపు 30 సంవత్సరాలు. అతని తల్లి మరణించి ఇప్పటికి దాదాపు 10 సంవత్సరములు అయింది. ఆయన తండ్రి సుబ్బారెడ్డి 'ఆర్.టి.ఓ'గా ఉద్యోగ విరమణచేసి, తన ఏకైక పుత్రుడు ప్రారంభించిన ఇండస్ట్రీని పూర్తి బాధ్యతతో పర్యవేక్షిస్తున్నారు. తన కుమారుడు తనకంటే చాలా గొప్పవ్యక్తి కావాలని, తను ఒక సంపన్న కుటుంబంతో వియ్యమందాలని సుబ్బారెడ్డి జీవిత ఉద్దేశ్యం.

మూడు లేక నాలుగువేల రూపాయల కోసం మద్రాసులో ఉద్యోం చేస్తున్న కృష్ణారావు తన లక్షల పెట్టుబడి గుఱించి, దానిమీద వచ్చే లాభాల గుఱించి, రేపటి పెరుగుదల గుఱించి, ముందురోజు రాత్రినుంచి వివరిస్తూ వస్తున్నా గోపాల్‌రెడ్డి కారు నడుపుతూ కూడా తన భవిష్యత్ ప్రణాళికను గుఱించి గొప్పగా చెబుతూనే వున్నాడు. బంజారాహిల్స్‌లోని తన బంగళానుంచి పంజగుట్ట జంక్షన్ వఱకు హాయిగా కారు నడిపాడు. అక్కడ నుండి ఒక 4,5 కిలోమీటర్ల వఱకు అంటే సంజీవరెడ్డినగర్ దాటేదాక కూడా ఒక ఆటోరిక్షా ఎంత హార్ కొట్టినా ఆయనకు సైట్ ఇవ్వకుండానే వెళ్తోంది. ఆ ఆటోరిక్షా రోడ్డుకు సరాసరి మధ్యగా గడగడగడా అని ముందుకే వెళుతూంది. ఎడమవైపు నుంచి 'ఓవర్‌టేక్' చేద్దామంటే అదే క్షణంలో ఆటో కూడా ఎడమవైపు తిరుగుతోంది. ఆ నెపం తన మీద వస్తుందని మాత్రం కాదు, తన బ్రాండ్ న్యూ కారుకు ఒక్క గీత పడడం కూడా అతను సహించలేడు. ఆ సమయమంతా హైద్రాబాద్ ట్రాఫిక్ గఱించి, హైద్రాబాద్ పోలీసు గుఱించి అతను తిడుతూనే వస్తున్నాడు. ఆ ఆటోరిక్షా డ్రైవర్ గుఱించి ''బ్లడీ బాస్టర్డ్' అని ఒక వందసార్లు తిట్టాడు. కృష్ణారావు తన మిత్రుడిని శాంతపర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. చివరికి, మరోసైడు నుంచి ట్రాఫిక్ కొంచెం ఆగిన ఒక నిముషములో ఆ ఆటోరిక్షాని 'ఓవర్‌టేక్' చేస్తూ తన స్పీడు కొంచెం తగ్గించి 'ఓరీ బ్లడీ రాస్కెల్ ఏమిటీ ఈ స్పీడు? నీకు బాంబే వఱకు పోవాలని వుందా' అని తన

కోపాన్నంతా వెళ్లగక్కుతూ ఆటోరిక్షావాణ్ణి అడిగాడు. అతను చాలా 'కూల్'గా ''అవునారా సాలా''... నీ అమ్మ అక్కడ నాకొఱకు వేట్ చేస్తుంది కదా. తిరుగు ప్రశ్న వేశాడు. (ఈ ప్రశ్న మరో ప్రశ్న ఉర్దూలో జరగడంవల్ల చాలా ఆభాసంగా ఉంది). రోడ్డు మధ్యలోనే సడన్ బ్రేక్ కొట్టి, కారాపి దిగబోతున్న గోపాల్‌రెడ్డి ఎడమ చేయిపట్టి అతనిని ఆపడానికి కృష్ణారావు ప్రయత్నించాడు కాని, కోపంలో ఊగిపో తున్న, పిచ్చెక్కిన గోపాల్‌రెడ్డిని ఆపడానికి ఒక ఏనుగు వచ్చినా కూడా సాధ్యం కాదు. ఆటోరిక్షా వాణ్ణి బయటకు లాగి చెంప చెళ్లుమనిపించాడు. మొదట ఖంగుతిన్న ఆటోడ్రైవర్ తేరుకొని, గోపాల్‌రెడ్డికి కూడా రెండిచ్చి, అతని చొక్కా చింపేశాడు. దానితో ఆగకుండా తన బూతుపదాల నిఘంటువు తెరిచాడు. భయంతో కంపిస్తున్న కృష్ణారావు తన స్నేహితుడిని కాపాడడానికి దగ్గరకు వెళితే అతనికి కూడా రిక్షావాడి నుంచి ఒక తన్ను లభించింది. అంతలోపల పెద్ద సమూహం వాళ్లచుట్టూ చేరింది.

ఒక కాకి చచ్చిపోతే వేరే కాకులంతా 'కా' 'కా' అను అరుచుకుంటూ వచ్చినట్లు, కొంతమంది ఆటోరిక్షావారు కూడా నిముషాలమీద వచ్చారు. కొంతమంది ఆటోరిక్షా వాణ్ణి ఆపుతుంటే, మరికొంతమంది గోపాల్‌రెడ్డిని ఆపడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని ఎవరికి కూడా వారిద్దరి వాక్ప్రవాహాన్ని ఆపడానికి సాధ్యం కాలేదు. ఆ జనసముదాయంలో కొంతమంది ఒక పక్షం నుంచి మాట్లాడుతుంటే ఇంకా కొంత మంది మరో పక్షాన్ని సమర్థిస్తున్నారు. ఆ ముఖ్యమైన రహదారిలో ఈ సంఘటనా స్థలానికి ఇరుప్రక్కల కొన్ని కిలోమీటర్ల దూరం వఱకు, ఎన్నో రకాల వాహనాలు ఆగిపోవడంవల్ల ఒక మహా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనేక వాహనాల వివిధ శబ్దాల హోరన్లు ; ఆ మనుష్యుల అరుపులు, కేకలు ఇవన్నీ కలసి కలగాపులగమై కురుక్షేత్రానికి ఒక కలియుగ ప్రతిరూపం ఏర్పడింది. ఆత్రంగా వెళ్లవలసిన వేలాదిమందికి, ఇంక ముందుకు పోవడానికి ఎంతసేపు పడుతుందో అని ఊహించలేని ఒక స్థితి ఏర్పడింది.

వాళ్లందరి అదృష్టమనే చెప్పవచ్చు... ఇన్‌స్పెక్టర్ ఖాన్ తన మెరుస్తున్న మోటార్ సైకిల్‌మీద ఆ సంఘటనా స్థలం యొక్క కేంద్రబిందువులో ప్రత్యక్షమయ్యాడు. గోపాల్‌రెడ్డి, ఆటోరిక్షావాడు తమ తమ వాఙ్మూలాన్ని ఎంతో నాటకీయంగా వివరించారు. తన వివరణలో గోపాల్‌రెడ్డి తనకెంతో ప్రియమైన తల్లి దివంగతమై ఇప్పటికి 10 సంవత్సరముల దాటిందని, ఒక మంచి కుటుంబానికి చెందిన అంత పెద్ద స్త్రీని గుఱించి ఈ వెధవ అలాటి అసభ్యకరమైన పదాలు వాడాడని ఇన్‌స్పెక్టరుతో చాలా దయనీయంగా మనవి చేసేటప్పుడు, అతనికి తెలియకుండానే వెక్కి వెక్కి ఏడ్చాడు. తన వర్గంవారు, తనవెనక అధిక సంఖ్యతో తనకు మద్దతు ఇవ్వడానికి వున్నారనే ధైర్యంతో, ఆ ఆటోరిక్షావాడు చాలా పొగరుగా నిలబడ్డాడు. గోపాల్‌రెడ్డి దీనమైన ఏడుపువిని, ఇన్‌స్పెక్టర్‌కే కాదు, అక్కడి జనసమూహంలో చాలా మందికి న్యాయం అతని పక్షంలోనే వుందనిపించింది. ఆ ఆటోరిక్షా వాడి పొగరు, అక్కడ చాలామందిలో

అతనికి విరుద్ధంగా, ఒక దురభిప్రాయం పెరగడానికి ఎరువు వేసింది.

ఆ ప్రత్యేక పరిస్థితిని, ఒక ప్రత్యేకరీతిలో ఇన్‌స్పెక్టర్ ఖాన్ తన చేతిలోకి తీసుకున్నాడు. అక్కడ చుట్టూ అధిక సంఖ్యలో గుమికూడిన ప్రజలకు వినిపించేటట్టుగా, కొంచెం పెద్ద గొంతుతో ఆయన మాట్లాడారు...

''ఈ ఆటో డ్రైవరుతో ఇతను బాంబేకేనాప్రయాణం చేసేది'' అని గోపాల్‌రెడ్డి అడిగాడు. అందులో కొద్దిగా పరిహాసచ్ఛాయ వుండవచ్చు; కాని, ఇతని అభిమానాన్ని దెబ్బతీసేదిగా ఏమీ లేదు. దానికి జవాబుగా అతను, ఇతనిని తిట్టివుంటే, అది తప్పు. కాని, అతను ఇతనిని తిట్టలేదు. దానికి బదులుగా, చచ్చిపోయిన ఇతని తల్లి గురించి చాలా అసభ్యంగా మాట్లాడాడు. మీలో ఎవరితోనైనా అతను అలా మాట్లాడివుంటే అతని నోటి పళ్లు మిగిల్చేవారా! నాతో ఎవరైనా అలా మాట్లాడితే అతనిలో ఒక ఎముక కూడా మిగిలి వుండదు. తల్లి అంటే, ప్రతి ఒక్కరికీ తల్లే. మనలో దేశప్రేమ పెంచడానికే కదా మనం మనదేశాన్ని భారతమాత అని పిలిచేది. ఎవరైనా ఇంకొకరి తల్లి గురించి చెడుమాట అనకూడదు. ఏమైనా గాని ఈ విషయంలో నేను చేసేది ఏమీ లేదు. రహదారిలో 'ట్రాఫిక్ అబ్‌స్ట్రక్షన్' చేసిన కారణంగా కావాలంటే వీరిద్దరిపై ఒక్క ''పిటీకేస్'' బుక్ చేయగలను. కానీ, ఒక తల్లిగురించి చెడుమాటలు అన్నందుకు, అది ఒక పరిహారం కాదు కదా! అలాంటి తప్పుకు, శిక్ష విధించడానికి గాని, శిక్ష ఇప్పించడానికి గాని నాకు శక్తి లేదు. కాని, మీరు ప్రజలు, ఈనాడు, ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారం మీ చేతిలో వుంది. అందుకే మీరే నిర్ణయించండి. ఏమని? తప్పు ఎవరి పక్షంలో వుందని? ఒక తల్లిని దూషించడం తప్పని మీకు అనిపిస్తే ఇతన్ని వదలకూడదు. ఏమి చేయాలో మీకు తెలుసుకదా! నేను ఒక కూల్‌డ్రింక్ తాగివచ్చేలోపల ఈ ట్రాఫిక్ జామ్ ఇక్కడ వుండకూడదు''.

ఇన్‌స్పెక్టర్ ఖాన్ ప్రక్కన వున్న ఒక కొట్టుదగ్గరకు మెల్లగా నడిచి వెళ్లాడు. ఆ జనసమూహం మధ్యన, అయిదు నిముషాలలో ఏమేమి జరిగిందో అతను గమనించలేదు. జరగాల్సినదంతా జరిగింది. ఇంక, ఏ తల్లిని గూడా తిట్టకుండా ఆ ఆటోడ్రైవరును కొంతమంది జనం చితకబాదారు. ఇంకా కొంతమంది అతనిపై కాళీయమర్దనం కూడా చేశారు. అక్కడ చేరిన మిగతా ఆటోడ్రైవర్లు తమ సహచరుడి రక్షణార్థం అడ్డుపడలేదని మాత్రమేకాదు, అందులో ముగ్గురు, నల్గురు అదే అదను అనుకొని మూడు నాలుగు వాయించారు కూడా.

ఖాన్ గారి శీతల పానీయ పానం పూర్తికావడంతోనే, రహదారిలో వాహన గమనాగమనం కూడా బాగుపడింది. తన కారును రోడ్డుకు ఒక ప్రక్కన పార్క్ చేసుకొని, ఇన్‌స్పెక్టర్ ఖాన్ దగ్గరకు వచ్చిన గోపాల్‌రెడ్డి ''థాంక్స్ ఎలాట్‌సర్'' తమరు

సరియైన సమయంలో ఇక్కడ చేరకుండా వుంటే ఏమేమి జరిగేదో, మేమూహించ లేము'' అని తన మిత్రుడిని కూడా ఉద్దేశించి చెప్పాడు.

''అసలు ఈ గొడవ మొదలు కావడమే అనవసరం కదా! మన ముఖ్యమంత్రి తల్లిని, ప్రధాన మంత్రి తల్లిని కూడా తిట్టే జనం చాలా మంది వున్నారు కదా! చనిపోయిన మీ తల్లి గురించి మీరు అంత 'సెన్సిటివ్' తీసుకోకుండా వుంటే బాగుండేమో! ఈ ఊరిలో, మామూలుగా మాట్లాడేప్పుడు, తల్లిని, సోదరిని గురించి అనవసరంగా బూతురు తిట్టడం మామూలే గదా! దానికంత ఉడికిపోతే చల్లారడం కష్టమవుతుంది. ఇంక తమరు వెళ్లవచ్చు''.

''ఆ చిన్న గీతోపదేశం ఇచ్చి, ఇన్‌స్పెక్టర్ ఖాన్ తన మోటార్ సైకిల్ స్టార్ట్‌చేసి మెల్లగా వెళ్లిపోయాడు. అలా దూరంగా వెళ్లిపోతున్న ఆ దేవదూతను గోపాల్‌రెడ్డి ఒక రెండు నిముషాలు పాటు రెప్ప వేయకుండా చూస్తుండిపోయాడు. తరువాత, తను ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు. అదేమిటంటే, పోలీసు వాళ్లలో కూడా మంచివారు వుండడంవల్ల ఇంక మొత్తం పోలీసు గురించి నే నెప్పుడుకూడా చెడుమా టలు అనను'' అని.